ప్రజాశక్తి

ఆదివారం 1 అక్టోబర్ 2023

5

అల్లూరి సీతారామరాజు

విద్యార్థుల అరెస్టుపై సిపిఎం ఖండన

ప్రజాశక్తి-పాడేరు: హాస్టల్స్‌లో సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శాంతియుతంగా విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులను అరెస్టు చేయడంపై సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పి అప్పల నర్స ఖండించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న విద్యార్థులపై కేసులు బనాయించడం అరెస్టులు చేయడం అమానుషమన్నారు. ఆరెస్టయిన వారిలో ఎస్.ఎఫ్.ఐ అధ్యక్ష కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్, సహాయ కార్యదర్శులు కిరణ్, పెద్దిరాజు, వినోద్ కుమార్, అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.జీవన్, కె.చిన్నారావుతో పాటు జిల్లా నాయకులు మత్యారాజు, సింహాద్రి, కార్తిక్ 17 మంది విద్యార్థినులతో సహా 99 మందిని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో ఉంచారని వీరిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నాకు రాకుండా హిందూపురం, పెనుగొండ, మడకశిర, కదిరి, కడప, కర్నూలు జిల్లాల్లో విద్యార్థి నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం గర్హనీయమన్నారు.

ఉక్కు బహిరంగ సభను జయప్రదం చేయండి

- గిరిజనులు, యువకులు, కార్మికులు తరలిరావాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి అరకులోయ రూరల్: వైసిపి ప్రభుత్వం సలహాదారుడు సజ్జల రామకృష్ణకు కమ్యూనిస్టుల్ని విమర్శించే నైతిక హక్కు లేదని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పనర్స అన్నారు. శనివారం అరకువేలి ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో మండల కార్యదర్శి కె.రామారావు, జిల్లా కార్యదర్శి సభ్యులు వి.ఉమామహేశ్వరరావుతో కలిసి స్టీల్ ప్లాంట్ పరిరక్షణకే అక్టోబర్ ఐదున జరిగే భారీ బహిరంగ సభ గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సంధర్భంగా అప్పనర్స మాట్లాడుతూ, రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బిజెపికి అమ్ముడుపోయిన జగన్ ప్రభుత్వం కమ్యూనిస్టులను విమర్శించడం దిగజారుడుతనమన్నారు. దళితులకు, మైనార్టీలు, గిరిజనులు, రైతులకు వ్యతిరేక చట్టాలు పార్లమెంట్లో బిజెపి ప్రవేశపెడుతుంటే వైసిపి చేతులెత్తి మద్దతు తెలిపిందని, మరీ బిజెపికి ఎంతకు అమ్ముడుపోయిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీస్ ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రశ్నించడం సిపిఎం రాజకీయ విధానమని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ను కారు చౌకగా ప్రైవేట్ వ్యక్తులకి కట్టబెడుతుంటే జగన్ ప్రభుత్వం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.రాష్ట్రాన్ని దివాలా తీసేందుకు బిజెపి అనుసరిస్తున్న విధానాలను ప్రశ్నించకుండా వైసిపి ప్రభుత్వం లొంగుబాటు దోరణి వ్యవహరిస్తుందన్నారు. ప్రజల కోసం ప్రాణాలను కమ్యూనిస్టులు త్యాగం చేశారని, అటువంటి చరిత్ర కలిగిన తమను విమర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలు ప్రజలు అర్థం చేసుకుంటున్నారని భవిష్యత్తులో జగన్‌ని అధికారం నుండి దించి ఇంటికి పంపించే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. ఐదో తేదీన జరిగే స్టీల్ ప్లాంట్ బైక్ యాత్ర ముగింపు సందర్భంగా కూర్మన్న పాలెంలో భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. కార్యకర్తలు, ప్రజలు, కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు జగన్నాథం, జె.భగత్‌రామ్ పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి.

హుకుంపేట: విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి వేతిరేకంగా 5న కూర్మనపాలెం జంక్షన్‌లో సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని హుకుంపేట మండల కమిటీ అధ్వర్యంలో బహిరంగ సభ గోడ పత్రికలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వి.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉక్కు పరిరక్షణ బైక్ యాత్ర సిపిఎం నిర్వహించిందన్నారు.స్టీల్ ప్లాంట్ అమ్మకం ఆపకపోతే కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వానికి ఘోరీ కడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకురాలు హైమావతి, సోమన్న, కృష్ణారావు, అప్పలకొండ పడాల్, ఆనంద్, ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అప్పలనర్స, ఉమామహేశ్వరరావు

పొంగి ప్రవహిస్తున్న తంటికొండ, గింజర్తి వాగు

ఈదురుగాలులతో భారీ వర్షం

- పొంగి ప్రవహిస్తున్న వాగులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. శనివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం వాతావరణం పొడిపొడిగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం తరువాత వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని ఒక్కసారిగా మెరుపులు, పిడుగులు, ఈదురుగాలితో భారీ వర్షం పడింది. వర్షం కారణంగా ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ద్విచక్ర వాహనదారులు తడిసి ముద్దయ్యారు. శనివారం సంత రోజు కావడంతో మండలంలోని పలు ప్రాంతాల నుండి ప్రజలు సంత నిమిత్తం రాజవొమ్మంగి రాగా, భారీ వర్షం వల్ల తమ గ్రామాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం నేపథ్యంలో రాజువొమ్మంగి ఒట్టిగడ్డ వాగు, మడేరు, లబ్బర్తి, తంటికొండ, గింజర్తి కాలువలు పొంగి ప్రవహించడంతో గంటల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. పిడుగుల పడిన నేపథ్యంలో చాలాచోట్ల ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయి. విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. ఒట్టిగడ్డ రిజర్వాయర్‌తో బాటు, మండలంలో పలు గ్రామాల్లో చెరువుల్లో నీరు చేరింది.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

ఉచితంగా వైద్య పరీక్షలు

పరిశీలిస్తున్న రాష్ట్ర నోడల్ అదికారి, జిల్లా ఆరోగ్య వైద్యాధికారి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. 594 మంది వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారి రమేష్ బాబు, డిఎం అండ్ జమల్ భాష, సర్పంచ్ వి.వెంకట్రావు, వైస్ ఎంపీపీ ఆనంద్, వైసిపి మండల నాయకులు వి సింహాచలం, కృష్ణారావు, మండల వైద్య అధికారులు కె,కరుణ, ప్రేమ పాల్గొన్నారు.

పెదబయలు రూరల్: అరడకోట గ్రామ సచివాలయ పరిధి గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా 522 మందికి వైద్య పరీక్షలు చేశారు. 89 మందిని వివిధ ఆసుపత్రులకు రిఫరల్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పూర్ణయ్య, డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్ సూపరింటెండెంట్ కృష్ణారావు, స్థానిక వైద్యాధికారి సింధూరం పడాల్, నిఖిల్ గోమంగి సర్పంచ్‌లు మత్యలింగం, కాసులమ్మ పాల్గొన్నారు.

రంపచోడవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థానిక ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఆరోగ్య సురక్షలో భాగంగా అందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే పరిశీలించారు. ఆరోగ్య పరీక్షలు, మందుల పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏడిఎంహెచ్ఓ జి.ప్రకాశం, తహశీల్దారు పివివి జయకుమార్, ఎంపిడిఓ హరికృష్ణ, వైద్యులు పాల్గొన్నారు.

వంతెన మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని పద్మపురం మేజర్ పంచాయితీ యండపల్లివలసలో బురద గెడ్డ వంతెన వర్షానికి దెబ్బతింది. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, ఆదివాసీ గిరిజన సంఘం డుంబ్రిగుడ మండల అద్యక్షుడు పి సత్యనారాయణ శనివారం దెబ్బతిన్న వంతెనను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, వంతెన మరమ్మత్తుకు గురై ప్రమాధకరంగా మారిందన్నారు. నిత్యం ప్రయాణికులు అరకులోయ నుండి పాడేరుకు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఏ సమయంలో ఏమీ జరుగుతోందని భయాందోళన రాకపోకలు సాగిస్తున్నారని తక్షణమే అధికారులు స్పందించి వంతెన మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వంతెన పరిశీలిస్తున్న సురేంద్ర, సత్యనారాయణ

నేడు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ

ప్రజాశక్తి -పాడేరు : ఈనెల 1న జిల్లా వ్యాప్తంగా ప్రతి రెవిన్యూ గ్రామ ఫరిధిలో స్వచ్ఛత హై సేవ కింద స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సూచనలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా ఈ స్వచ్ఛతా కార్యక్రమాలు జరుగుతాయని కలెక్టర్ వివరించారు. ఇందులో భాగంగా అన్ని గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్విహిస్తున్నట్లు తెలిపారు. ఈ స్వచ్ఛత కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

తాత్కాలిక వంతెన కొట్టుకుపోయిన దృశ్యం

కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

- కెడి.పేట, చింతపల్లి మార్గంలో నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి-కొయ్యూరు

జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా కొయ్యూరు మండలంలోని రామరాజుపాలెం, పెదమాకవరం గ్రామాల మధ్య ఉన్న కాలువపై రాకపోకల కోసం నిర్మించిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో కెడి. పేట - చింతపల్లి మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. జాతీయ రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో రామరాజుపాలెం, పెదమాకవరం గ్రామాల మధ్య ఉన్న వంతెనను కూల్చి కొత్త వంచన నిర్మాణం చేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా దాని పక్కన నుండి తాత్కాలిక వంతెన నిర్మించారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద ఉధృతి ఎక్కువై తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. కెడి. పేట - చింతపల్లి మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రయాణికులు, ఈ పరిసర ప్రాంతాల్లో ఉద్యోగాల రీత్య రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా వరదలు తగ్గిన తర్వాత మళ్లీ తాత్కాలిక వంతెన నిర్మిస్తామని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఈ ప్రాంత వాసులు మండిపడ్డారు. కేడీపేట నుండి చింతపల్లి సీలేరు పాడేరు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి ఇదే కావడంతో వెంటనే ఈ వంతెన నిర్మించాలని ఈ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఐటిడిఎ పిఒ, అంగన్వాడీలు, అధికారులు

ప్రధాని వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-రంపచోడవరం : దేశంలోని అన్ని జిల్లాల అంగన్వాడీలతో ఢిల్లీ భారత్ మండపం నుండి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రంపచోడవరం ఏజెన్సీ అంగన్వాడీలు పాల్గొన్నారు. రంపచోడవరం ఐటిడిఎ సమావేశం మందిరంలో నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వారిలో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్య లక్ష్మి, ఐటిడిఎ ఎపిఓ సిహెచ్.శ్రీనివాసరావు, నీతి అయోగ్ అధికారి పెదబాబు, సిడిపివోలు ప్రసన్నలక్ష్మి, సిహెచ్.లక్ష్మి, సంధ్యారాణి, ఏపీఈపీడీసీఎల్ ఇఇ ఎండి.యూసఫ్, ఎంపీడీవో జయంతి, ఎన్ఐసి అధికారి నరసింహారావు, వైటిసి మేనేజర్ సుదీస్, అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. భారతదేశంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను ఒక మోడల్‌గా ఉండే విధంగా నీతి అయోగ్ ద్వారా సంకల్ప సప్తహ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా ప్రధాని తెలిపారు.

2న జాతీయ అల్లూరి యువజన సంఘం మహాసభ

ప్రజాశక్తి -అడ్డతీగల : జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం మహాసభ అక్టోబర్ 2న అడ్డతీగలలోని శ్రీసూర్య స్కూలులో జరుగుతుందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఎన్నిక, ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. సంఘం తమిళనాడు అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు వెంపటి మాధవులనాయుడు ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు అల్లూరి దాడి చేసిన అడ్డతీగల వాస్తవ పోలీస్ స్టేషన్ ముందు సంఘం ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహానికి నివాళులర్పించి, మహాసభను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మల్లవరంమామిళ్ల గ్రామం సమీపంలో అడ్డతీగల పోలీస్ స్టేషన్‌పై అల్లూరి దాడికి వ్యూహరచనలు చేసిన తేనెల మంగి ప్రాంతంలోని తెల్లమద్ది చెట్టును సందర్శిస్తారని తెలిపారు. 'ఒకే ఒక్కడు' సినిమా నిర్మాత రాజాసాగి సత్యనారాయణ రాజును, అల్లూరి దాడి చేసిన 6 పోలీస్ స్టేషన్ల స్మారక చిహ్నంగా కేంద్ర తంతి తపాలా శాఖచే 6 ప్రత్యేక పోస్టల్ కవర్లు విడుదల చేయించిన ఉమ్మడి ఏపీ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లును, మాధవుల నాయుడును సన్మానిస్తారని వీరభద్రరావు తెలిపారు.

పరీక్షలకు హాజరైన అభ్యర్థులు

ప్రశాంతంగా రాత పరీక్ష

ప్రజాశక్తి-పాడేరు: నీతి ఆయోగ్ యాస్పిరేషన్ ఫెలో రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని సిపిఓ ఎస్ ఎస్. ఆర్.కె. పట్నాయక్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక గురుకుల కళశాలలో నీతి ఆయోగ్ యాస్పిరేషన్ ఫెలో రాత పరీక్షను శనివారం నిర్వహించామని చెప్పారు. మూడు పోస్టులకు 505 మంది అభ్యర్దులు దరఖాస్తులు చేసారని 398 మంది రాత పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు అర్హత సాధించిన అభ్యర్థులకు సమాచారం అందిస్తామన్నారు. జిల్లా వెబ్ సైట్‌లో ఇంటర్వ్యూకు అర్హత సాధించిన వారి జాబితా పొందుపరుస్తామని చెప్పారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలోని కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా పౌర సంబంధాల అధికారి పి.గోవిందరాజులు శనివారం ఒక ప్రకటనలో తెలియజేసారు. అక్టోబరు 7వ తేదీలోపు కలెక్టర్ కార్యాలయంలో ఉన్న జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయానికి పూర్తి చేసిన దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అభ్యర్దుల పేరు, తండ్రిపేరు, పుట్టిన తేదీ, పూర్తి చిరునామా, కళారూపం, అనుభవం, కళాకారులుగా పొందిన దవ పత్రాలు, ఫోన్ నంబరు, ఆధార్‌నంబరు, ఈమెయిల్ అడ్రసుతో దరఖాస్తు చేయాలని చెప్పారు.

సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్కాస్ట్), పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ 2023 కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం శనివారం పాడేరులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖ అధికారి గౌరీ శంకరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ 2023కు సంబంధించి మంచి ప్రాజెక్టులను విద్యార్థులతో సిద్ధం చేయించాలని కోరారు. విద్యార్థులు పోటా పోటీగా ప్రాజెక్టులు తయారు చేయాలన్నారు. గత సంవత్సరం జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జాతీయ స్థాయి పోటీలలో గెలుపొందిన కే.జీ.బీ.వీ పాడేరు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు సత్యవతి, రమణమ్మలను డిఈఓ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ పి.రమణ మూర్తి నాయుడు, జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్. కె.జె.రామారావు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-చింతపల్లి: రాబోవు సార్వత్రిక ఎన్నికలలో పాడేరు నియోజకవర్గంలో సిపిఐ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పథకాలు రచించుకుని ముందుకు సాగాలని ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ పిలుపునిచ్చారు. సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు దివంగత గంధం నర్సింగరావు ఇంటి ఆవరణలో ఆ పార్టీ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు అధ్యక్షతన మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సత్యనారాయణ మాట్లాడుతూ,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలన్నారు.

మెటల్ వేసి తారు మరిచారు

- కనీసం గ్రావెల్ కూడా వేయకపోవడంతో ప్రమాదాలు
- తక్షణమే పూర్తి చేయాలి
- సిపిఎం నాయకులు సత్యనారాయణ, చిన్నబాబు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని కుందులూరు గ్రామపంచాయతీ పరిధిలోని తెల్లవారిగూడెం నుండి గుల్లెటివాడ మధ్య రహదారి నిర్మాణంలో భాగంగా గుత్తేదారుడు రెండేళ్ల క్రితం మెటల్ వేసి వదిలేశారని, తారు వేయకపోగా, కనీసం దానిపై గ్రావెల్ కూడా వేయకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న ఈ రహదారిని శనివారం సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ 3.2 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి రూ.159.29 లక్షలు మంజూరు కాగా, రెండేళ్ల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించారని తెలిపారు. గుత్తేదారుడు రోడ్డుపై మెటల్ వేసి కనీసం గ్రావెల్ కూడా వేయకుండా నాటి నుండి వదిలేశారని పేర్కొన్నారు. దీంతో ఎటువంటి వాహనాలు కూడా తిరగలేని పరిస్థితి ఉందని, గుల్లెటివాడ నుండి తెల్లవారిగూడెం మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు రోడ్డు ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

- మెటల్ వేసి వదిలేసిన రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు సత్యనారాయణ, చిన్నబాబు

- ప్రమాదంలో గాయపడిన గుట్టప్పను పరామర్శిస్తున్న దృశ్యం



ప్రమాదంలో గాయపడిన బాధితునికి పరామర్శ

మండల కార్యాలయానికి ద్విచక్ర వాహనంపై వస్తూ ఈ మెటల్ రోడ్డుపై అదుపుతప్పి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందిన సున్నం గుట్టప్పను శనివారం ఆయన స్వగ్రామంలో సిపిఎం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంత కాలం ఇలా అసంపూర్తిగా రోడ్డును నిర్మించకుండా ఉంచుతారని, తక్షణమే అధికారులు స్పందించి అసంపూర్తిగా మిగిలిపోయిన ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి శాంతిరాజ్, సభ్యులు తెల్లం. కన్నారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వితంతు కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చింతూరు : జమాల్ ఖాన్ ఛారిటబుల్ ట్రస్ట్ (జెకెసిటి) ఆధ్వర్యంలో శనివారం ఆరు నిరుపేద ముస్లిం వితంతు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి పదివేల రూపాయలు చొప్పున రూ.60వేలు ఆర్థిక సాయం అందించారు. ట్రస్ట్ రెండవ సమావేశం ఒడిస్సా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లా మోటు తాలూకా ఇస్మాయిల్ నగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ మాట్లాడుతూ భర్తలను కోల్పోయి కడు బీద పరిస్థితుల్లో బతుకుతున్న పేద వితంతు కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం కుంట గ్రామానికి చెందిన వితంతు బషీర్ సతీమణికి, ఆవిదున్నేసా రెహమాన్ ఖాన్ సతీమణి నౌషాద్బికి, ఇతర వితంతువులకు కుటుంబానికి రూ.10వేలు చొప్పున రూ.60 వేలును ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్, సెక్రటరీ ఇమ్రాన్ ఖాన్, సుభాని, మోటు గ్రామ పెద్దలు మాసుం ఖాన్, చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీలేరు పిహెచ్‌సి వైద్యులు అబ్దుల్ రెహమాన్, అక్బర్. నూర్ చాచా, జావేద్, రాజు రానా, గ్రామ పెద్దలు వహీదుల్లా ఖాన్, ఫతే ఖాన్, హాషం ఖాన్, మాసోమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న జమాల్ ఖాన్ తదితరులు

పనులు ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-జి.మాడుగుల: పెదలువ్వాసింగి పంచా యితీ చిలకలపాలెం నుండి ఎస్తాలు గ్రామం వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర 80 లక్షల తో చేపట్టే రహదారి నిర్మాణ పనులకు శనివారం స్థానిక వైసీపీ నాయకులు పారంభించారు. వారు మాట్లాడుతూ, ఈ రహదారి నిర్మాణం పూర్తయితే సుమారు 20 గ్రాముల ప్రజలకు రవాణా కష్టాలు తీరుతాయని తెలిపారు. రహదారి సౌకర్యాలు లేన పడిన ఇబ్బందులు తొలగి పోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

ఐఐహెచ్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : తీవ్రమైన తలనొప్పి ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్ (ఐఐహెచ్) వ్యాధికి కారణం కావచ్చని న్యూరో ఆప్తమాలజిస్ట్ డాక్టర్ వీరేందర్ సచ్ దేవా పేర్కొన్నారు. ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్యశాల న్యూరో ఆప్తమాలజి వైద్య బృందం ఆధ్వర్యాన ఆసుపత్రిలో శనివారం ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్ వ్యాధి పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వ్యాధి సాధారణంగా గర్భధారణ వయస్సు 20 నుంచి 50 మధ్య వయస్సు గల స్త్రీలలో, ఊబకాయం ఉన్న వారిలో వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఈ వ్యాధి రెండు కళ్లను, మెదడును ప్రభావితం చేస్తుందన్నారు. ఎడతెగని తలనొప్పి ఈ వ్యాధి సాధారణ లక్షణమన్నారు. దీనిని అశ్రద్ధ చేస్తే దృష్టి లోపం, చూపును పునరుద్ధరించలేని నష్టం, ఇతర సమస్యలు తలెత్తవచ్చని తెలిపారు. తీవ్రమైన తలనొప్పి వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే న్యూరాలజిస్ట్ లేదా ఆప్తమాలజిస్ట్‌ను సంప్రదించాలని డాక్టర్ వీరేందర్ తెలిపారు. ఈ వ్యాధి ఊబకాయం, విటమిన్ -ఎ సంప్లిమెంట్స్, యాంటిబయాటిక్ వాడకం, గర్భ నిరోధక మాత్రలు వాడటం, స్టెరాయిడ్స్ వంటి ప్రత్యేక మందులు తీసుకున్న వారికి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఎల్విప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఈ వ్యాధి నిర్ధారణకు అవసరమైన అన్ని ఆధునిక పరికరాలు, చికిత్స అందించేందుకు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు.

న్యాయవాదుల రక్షణ చట్టంపై ఉద్యమం

ప్రజాశక్తి-లీగల్ : న్యాయవాదుల రక్షణ చట్టంపై ఉద్యమం చేపట్టాల్సిన అవసరముందని ఆలిండియా లాయర్స్ యూనియన్ విశాఖపట్నం జిల్లా కమిటీ అభిప్రాయపడింది. ఆలిండియా లాయర్స్ యూనియన్ విశాఖపట్నం జిల్లా నూతన కమిటీ సర్వసభ్య సమావేశం శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు అల్లు సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఆ సమస్యలను ప్రణాళిక బద్ధంగా అధిగమించేందుకు వివిధ పద్ధతుల్లో ఉద్యమాలు చేయాలని సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. అనంతరం కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, న్యాయవాదుల రక్షణ చట్టంపై రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టి చట్టంగా రూపొందించాలని తీర్మానం చేస్తూ, ఆ తీర్మాన ప్రతిని శాసనసభ స్పీకర్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నూతన కమిటీ ఉపాధ్యక్షులు బగాది తులసీదాస్, చాట్ల ఆనందరెడ్డి, ఎంపీ మధు, పాపారావు, కార్యదర్శులు పూర్ణిమ, కె.వైమని, పార్వతీశ్వరరావు, ఈశ్వరరావు, సంతోషి, గణపతి, కోశాధికారి బి.అప్పలరెడ్డి, గౌరవాధ్యక్షులు బివి.రామాంజనేయరావు తదితరులు పాల్గొన్నారు.

నెఫ్రాలజీ ఆరో వార్షిక సమావేశం ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ ఆరో వార్షిక రాష్ట్ర సమావేశాన్ని విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో శనివారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు నెఫ్రాలజీ రంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యారు. మాజీ డిఎంఇ, ఎన్‌టిఆర్‌యుహెచ్ఎస్ వీసీ డాక్టర్ టి.రవిరాజు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ప్రసాద్ గుల్లిపల్లి నిర్వహణలో సాగిన సమావేశంలో 150 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

హుకుంపేటలో నిరసన చేపడుతున్న నేతలు

జి.మాడుగుల: నిరుద్యోగ యువతి యువకులకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ పెట్టి యువతకు ఉపాధి కల్పించి ఉద్యోగాలను కల్పించడమే ఆయన చేసిన తప్పా అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బాబు తో నేను కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎస్.కె.రెహమాన్, ఎస్.నాగబ్బాయి, మాజీ ఎంపీటీసీ లక్ష్మణరావు, యువకులు పాల్గొన్నారు.

హుకుంపేట: ప్రజాస్వామ్య దేశంలో ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయడం తగదని టిడిపి అరకు నియోజకవర్గం పరిశీలికుడు దువ్వారపు రామారావు అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టులకు నిరసనగా బస్సు షెల్టర్ వద్ద శనివారం నిరాహార దీక్ష చేపట్టారు. ఎమ్మెల్సీ రామారావుతోపాటు మాజీమంత్రి కిడారి శ్రావణ్ కుమార్, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సివెరి దొన్ను దొర, ఎస్సీ ఎస్టీ మాజీ కమిషన్ సభ్యులు అబ్రహం, నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ,నిరుద్యోగ యువకుల ఉపాధి కల్పనలో భాగంగా స్కిల్ డెవలప్మెంట్ కోసం రూ 371 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తే ప్రతి పైసా ఖర్చు చేస్తూ ప్రవేశపెట్టిన పత్రాలు ఎందుకు పరిగణంలోకి తీసుకోలేదని పేర్కొన్నారు.ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సివెరి దొన్ను దొర మాట్లాడుతూ,ఉపాధ్యాయులకు, నిరుద్యోగులకు జగన్ రెడ్డి మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, తులసిరావు, లక్ష్మణుడు, వెంకటరమణ రాజు, సంతోష్ కుమార్, శ్యామ్, లక్ష్మయ్య, పి.లక్ష్మయ్య, బొంజు బాబు, నాగేష్ బూర్జ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

చింతపల్లి: ప్రతి పక్షాల గొంతు నొక్కి వైకాపా ప్రభుత్వం రాక్షశానందం పొందుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ మాజీ చైర్మన్ మొట్టడం వీర వెంకట సత్య ప్రసాద్ విమర్శించారు. ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య తో కలిసి మండలంలోని తాజంగి పంచాయతీ పరిధిలో బాబుతో నేను అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యుడు పొత్తూరు రాంబాబు, ఆ పార్టీ కార్యకర్తలు కిముడు శ్యాంసుందర్ నారాయణరావు, బెన్నలింగంమూర్తి పడాల్, ఎర్రయ్య, వెంకటరమణ, రామకష్ణ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వినూత్న ఆవిష్కరణలపై దృష్టిసారించాలి : వీసీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : వినూత్న ఆలోచనలు, అవిష్కరణల దిశగా విద్యార్థులు దృష్టి సారించాలని వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి సూచించారు. ఇంజినీరింగ్ విద్యార్థుల తరగతుల ప్రారంభం సందర్భంగా శనివారం ఎయు కన్వెన్షన్ సెంటర్లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ కళాశాల (ఏ), మహిళ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి వీసీ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేవలం ఉద్యోగం సాధించాలనే ఉద్దేశంతో కాకుండా సృజనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణల దిశగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. నాలుగేళ్ల ఎయు విద్యాభ్యాసంలో ఏదో ఒకటి సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. ఏయూలో చదివిన విద్యార్థులకు అద్భుతమైన అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి దీటుగా గత ఏడాది కోర్ కోర్సుల విద్యార్థులు మంచి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకున్నారని పేర్కొన్నారు. మెకానికల్, మెరైన్, సివిల్, ఆర్కిటెక్చర్ వంటి కోర్సుల్లో మూడు నుంచి నాలుగు ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఒక్క జిందాల్ స్టీల్ కంపెనీలోనే 27 మంది ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకున్నారని చెప్పారు. పారిశ్రామికంగా ఉన్న అవకాశాలను వినియోగించుకునేందుకు విద్యార్థులు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ట్రెండ్ ఆఫ్ ఇండస్ట్రీని ఒడిసిపట్టాలన్నారు. సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, రోబొటిక్ అంశాల్లో నైపుణ్యం గల వారికి మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఎయులో నాలుగేళ్ల క్రితం ఏర్పాటుచేసిన అ-హబ్లో ప్రస్తుతం 124 కంపెనీలు ఫంక్షనింగ్లో ఉన్నాయని వివరించారు. వినూత్న ఆలోచనలు ఉన్న విద్యార్థులు ఇక్కడ స్టార్టప్‌లు ఏర్పాటుచేయడం ద్వారా వారి ఆలోచనలకు కార్యరూపం ఇవ్వొచ్చు అని తెలిపారు. వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలతో వచ్చే విద్యార్థులకు వర్సిటీ యంత్రాంగం అన్ని రకాలుగా పూర్తిస్థాయిలో సహకారాన్ని అందిస్తుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మీ అండ్ మై ప్లాంట్ కాన్సెప్ట్‌ను విస్తరించనున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి కోర్సు పూర్తయ్యే వరకు దాన్ని పరిరక్షించాల్సి ఉంటుందని వివరించారు. దీనికి ప్రత్యేకంగా మార్కులు కూడా కేటాయించనున్నామని చెప్పారు. విద్యార్థులు చెడు లవాట్లుకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య శశిభూషణరావు, మహిళ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య భట్టి, లా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య విజయలక్ష్మి, పలువురు విభాగాధిపతులు, పాల్గొన్నారు.

ఎంవిఎన్.కపర్ది శతజయంతి సభ

ప్రజాశక్తి-సీతమ్మధార : సిపిఐ, ఎఐటియుసి నాయకులు ఎంవిఎన్.కపర్ది శత జయంతి సభను ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. 'భారతదేశ భావన - మార్క్సిస్టు దృక్పథం' అంశంపై సదస్సు నిర్వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు మానం ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సదస్సులో న్యూ సోషలిస్ట్ ఇనిషియేటివ్ ప్రతినిధి డాక్టర్ రవి ప్రకాష్ సిన్హా మాట్లాడుతూ, స్వాతంత్ర ఉద్యమంలో ఏమాత్రం పాత్రలేని హిందుత్వ భావజాలం ఆ తర్వాత ఆధిపత్యం సాధించిందని చెప్పారు. దీన్ని కమ్యూనిస్టులు తిప్పికొట్టాలన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ, మార్క్సిస్టు సిద్ధాంత అవగాహనతో కపర్ది ఎన్నో కార్మిక సంఘాలను నిర్మించారని చెప్పారు. కార్మిక ఉద్యమం - కుల అస్తిత్వ ఉద్యమాలు, భవిష్యత్తు అంశంపై ఆచార్య కె.శ్రీనివాసులు, అసంఘటిత రంగం కార్మిక ఉద్యమాలు - సమస్యలపై ఆచార్య జి విజయ్, ఐటీ రంగం, కృత్రిమ మేధ - భవిష్యత్తు కార్మిక ఉద్యమం అంశంపై వై.కిరణ్ చంద్ర ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కపర్ది కుమారుడు జగన్మోహన్‌రావు, కుమార్తె అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ముగ్గురు యూట్యూబర్లు అరెస్టు

ప్రజాశక్తి-అనంతగిరి రూరల్: వన్య ప్రాణులను వేటాడి వంటకం చేసి యూట్యూబ్లో అప్లోడ్ చేసిన ముగ్గురు యూ ట్యూబర్లను అనంతగిరి ఫారెస్ట్ అధికారులు అరెస్ట్ చేశారు వివరాల్లోకి వెళ్తే.... నిత్యం యూట్యూబ్‌ల కోసం వీడియోలు చేస్తూ అటవీ ఉత్పత్తులు ఆటవి జంతువుల మనుగడపై రోజు యూట్యూబుల్లో అనంతగిరి మండలం లక్ష్మీపురానికి చెందిన నందుల అప్పలరాజు, నందుల సురేష్ మరో సింహాద్రిబాలు ప్రసారాలు చేస్తుంటారు వన్య ప్రాణులను వెంటాడి వేటాడి వండి అప్లోడ్ చేయడంతో గమనించిన అటవీ శాఖ అధికారులు వీరిపై నిఘా వేశారు. శుక్రవారం ఈ ముగ్గురుని స్థానిక ఫారెస్ట్ అధికారులు సిహెచ్ . దుర్గ ప్రసాద్ రావు, అనంతగిరి రేంజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేశారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం వీరిని అరెస్ట్ చేశామన్నారు. ఒక మైనర్ బాలుడికి జువైనల్, మిగతా ఇద్దరికీ విశాఖ జైల్ కు రిమాండ్‌కు తరలించారు,

పెద్దఉప్పలంలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలంలోని పెదఉప్పలం గ్రామంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురైనట్లు స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. శనివారం ఉదయం మృతుని కుటుంబ సభ్యులిచ్చిన సమాచారం మేరకు పెదఉప్పలం గ్రామానికి చెందిన దళితుడు లండా జోగారావు(35)ను అదే గ్రామానికి చెందిన వారు హత్య చేసినట్లు తెలిపారు. హత్యకు గీతకార్మికులు కత్తి పదును పెట్టేందుకు ఉపయోగించే కర్రను ఆయుధంగా ఉపయోగించినట్లు గుర్తించామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు మహిళల అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ: సారాను అక్రమంగా తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను పట్టుకొని అరెస్టు చేశామని కేడిపేట ఎస్సై ఉపేంద్ర తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, నాటుసారా అక్రమంగా తయారుచేసి, అమ్ముతున్నారని సమాచారం మేరకు కొయ్యూరు మండలం రత్నంపేట గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలను వేరు వేరు కేసుల్లో పట్టుకొని కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ఇద్దరి వద్ద ఐదేసి లీటర్ల నాటుసారా స్వాదీనం చేసుకున్నామన్నారు.

భార్యను హతమార్చిన భర్త

ప్రజాశక్తి-కొత్తకోట: భార్యపై అనుమానంతో తలపై కొట్టి హత్య చేసిన సంఘటన రావికమతం మండలం చీమలపాడు శివారు అజేయపురం గిరిజన గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మృతురాలు తండ్రి వంతల పొట్టిదొర ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొత్తకోట ఇన్చార్జి ఎస్ఐ కుమారస్వామి శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు గిరిజన గ్రామానికి చెందిన వంతల పొట్టి దొర కుమార్తె పార్వతితో పాంగి గణపతికి కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులున్నారు. గణపతి తరచూ మద్యం సేవిస్తూ భార్యను అనుమానిస్తూ వేదించవాడు. పలువురు సర్ది చెప్పినా కొన్ని రోజుల తర్వాత మామూలుగా ఉండేవాడు. మృతురాలు పార్వతి అన్నీ సహించి కుటుంబాన్ని నెట్టుకొచ్చేది. ఈ నేపధ్యంలో శుక్రవారం రాత్రి గణపతి మరింత పూటుగా మద్యం సేవించి పార్వతితో గొడవపెట్టుకున్నాడు. కత్తికి ఉపయోగించే వెదురు పెడు (కొయ్య)తో బలంగా పార్వతి తలపై బలంగా కొట్టాడు.దీంతోచ తన కుమార్తె అక్కడికక్కడే మృతి చెందిందని మృతురాలి తండ్రి వంతల పొట్టిదొర ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. గణపతిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

ఎయు లుక్స్ డిజిటల్ స్టూడియో ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఎయు లుక్స్ డిజిటల్ స్టూడియోను విడిఎం ఇండియా ఆన్ ది మూవ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అజిత్‌కుమార్ ఆచార్య శనివారం ప్రారంభించారు. ఎయు లుక్స్ వార పత్రికలను, డిజిటల్ ఛానల్ సేవలను అజిత్ కుమార్ ఆచార్య అభినందించారు. ఎయు అభివృద్ధి పదంలో నడుస్తోందని పేర్కొన్నారు. ఎయు వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం సమాచారం వీడియో, ఆడియో ద్వారా ఎయు లుక్స్ డిజిటల్ ఛానల్ ప్రసారం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రెక్టారు ఆచార్య సమత, ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఆచార్య శ్రీనివాసరావు, శశిభూషణరావు, ఎ.నరసింహరావు, రాజేంద్రప్రసాద్, శోభశ్రీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేష్

జల్ జీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-చింతూరు : జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో ఇంటింటికి తాగునీరు అందించే పైపులైన్, ఇతర పనులు త్వరితగతిన పూర్తి చేసి, తాగునీరు అందించాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. ఏడుగురాళ్లపల్లిలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. అనంతరం ఏడుగురాళ్లపల్లి, తుమ్మల, సచివాలయాల పరిధిలో మంచినీటి సమస్యను, జల్ జీవన్ మిషన్ పైపులైన్ పనులను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా మండలంలోని 24 గ్రామాల్లో పైపులైన్, ఇంటికి ట్యాప్‌లు వేసే పనులు కొన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని మాత్రమే జరిగాయని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో పనులు చేపట్టడంలో అధికార యంత్రాంగం, ప్రభుత్వం విఫలమైనట్లు పేర్కొన్నారు. చింతూరు మండల కేంద్రంలోని గొల్ల బజార్, బీసీ కాలనీ, లారీ ఆఫీస్ ఏరియా, ఏ ప్రాంతానికి కూడా పైపులైన్ ద్వారా నీరు అందించడం లేదని పేర్కొన్నారు. దీంతో ప్రజలంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లం సుబ్బమ్మ, ముర్రం రంగమ్మ, సవలం కన్నయ్య, తాటికొండ కోటేశ్వరరావు, సవలం దేసయ్య, సౌలం రాజులు, తిరుపతమ్మ సవలం, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్నులు, పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం రామాలయం వద్ద జిసిసి అకౌంటెంట్ కోరాబు వెంకటరమణ, ఆయన కుమార్తె కోరాబు తులసి ప్రవల్లిక శనివారం 60 పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పీట సింహాచలం, ఎంపీటీసీ అంబటి నూకాలు, తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల అంగన్వాడీ కేంద్రం ఆయా పోస్టుకు ఎంపికైన తగ్గి సరస్వతికి శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కేవీ ప్రవీణ్ కుమార్ నియామకపత్రం అందజేశారు. సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు.

నేడు శ్రమదానం

ప్రజాశక్తి-కొయ్యూరు : స్వచ్ఛతాహి సేవా, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో భాగంగా అక్టోబర్ 1న ఆదివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ శ్రమదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లాలం సీతయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ వాలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఐక్యతతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాబోయే రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు బంగారు భవిష్యత్తు కావాలనుకుంటే బహుజనులు అందరూ ఐక్యంగా కలిసి ఉండాలని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల మహాసేన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కొంగర అనిల్ కుమార్ అన్నారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరినీ ఐక్యంచేసి ఏకతాటిగా నడిపించడమే తమ లక్ష్యమన్నారు. దేశ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర బిసి సంఘం అధ్యక్షులు రాచపల్లి ధర్మేంద్ర, ఎపి రాష్ట్ర అధ్యక్షుడు మేడి శివ, నాయకులు దామెర కరుణ, చెంగల చిన్నారావు, చింతాడ సూర్యం, గండి రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉక్కుపై తాడోపేడో తేల్చుకుంటాం

ప్రైవేటీకరణ కాదని ప్రధాని, కేబినెట్ ప్రకటించాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం
11వ రోజుకు ఉక్కు రక్షణ యాత్ర
అడుగడుగునా ఆదరణ .. అంతటా అనూహ్యస్పందన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, కలెక్టరేట్, సీతమ్మధార, ఎంవిపి.కాలనీ విలేకరులు

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న లోకనాథం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటుపరం కాదని బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు చెప్పడం కాదని, స్వయంగా ప్రధాని మోడీ, కేంద్ర కేబినెట్‌నే ఆ ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత నెల 20న విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమై ఉత్తరాంధ్ర అంతటా సాగిన ఉక్కు రక్షణ యాత్ర 11వ రోజుకు చేరింది. శనివారం ఈ యాత్ర అక్కయ్యపాలెం, ఎఎస్ఆర్.నగర్, గురుద్వారా, సీతంపేట, బివికె సెంటర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎవిఎన్ కళాశాల, కోడి పందాలవీధి, పూర్ణామార్కెట్, సిరిపురం, సత్యం జంక్షన్, ఈనాడు, సీతమ్మధార, హెచ్‌బి కాలనీ, కృష్ణా కాలేజీ, ఇసుకతోట, వెంకోజీపాలెం, ఎంవిపి.కాలనీ, ఉషోదయ, పెదవాల్తేరు, సిబిఐ జంక్షన్ మీదుగా మద్దిలపాలెంలోని సిపిఎం కార్యాలయం వరకూ సాగింది. పలుచోట్ల జరిగిన సభలకు జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నేతల ప్రసంగాలు వారిలో చైతన్యం నింపాయి. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదం హోరెత్తింది. యాత్ర కొనసాగిన ప్రతిచోటా జనం నుంచి పూలవర్షం కురిసింది. సిపిఎం చేస్తున్న పోరాటానికి పలువురు మద్దతు తెలిపారు. నగరంలోని కోడి పందాలవీధి (రెల్లివీధి), ఎవిఎన్.కాలేజీ, పూర్ణా మార్కెట్‌లలో పేదలు పెద్ద సంఖ్యలో హాజరై యాత్ర చేపట్టిన వారిని అభినందించారు. యాత్రా బృందం సభ్యులు విశాఖ ఉక్కు అనగానే రెల్లివీధి యువత గొంతు కలుపుతూ 'ఆంధ్రుల హక్కు' అంటూ నినాదాలు చేశారు.

పిడికిలెత్తి విశాఖ ఉక్కుకు జై కొట్టిన విద్యార్థులు

శనివారం మధ్యాహ్నం ఎవిఎన్ కాలేజీలోగల వృత్తివిద్యా విభాగం, ఇంటర్, పాలిటెక్నిక్ కాలేజీల్లో బైక్ యాత్ర చేపట్టిన సిపిఎం శ్రేణులు విడివిడిగా విద్యార్థులతో ఇంటరాక్షన్‌లో పాల్గొన్నాయి. స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రైవేటీకరణ విధానం నుంచి కాపాడుకోలేకపోతే భవిష్యత్ ఎలా అంధకారమవుతుందో వివరించడంతో విద్యార్థినీ, విద్యార్థులంతా ఒక్కసారిగా 'విశాఖ ఉక్కు రక్షణ' నినాదాలు చేశారు. కాలేజీలో పాఠాలు చెప్పే మహిళా లెక్చరర్ ఒకరు విద్యార్థులకు ప్రభుత్వ రంగ సంస్థల గొప్పతనం గురించి చెబుతూ ...దేశంలో చాలా ప్రభుత్వ రంగ పరిశ్రమలున్నాయి. వాటన్నిటికీ ప్రమాదం ఏర్పడింది. ప్రైవేటీకరణ జరిగితే మీకెవరికీ ఉద్యోగాలు కష్టం. అలా జరగకుండా ఉండాలని సిపిఎం నాయకులు ఉత్తరాంధ్రలో ఊరూరా తిరిగి చెబుతున్నారు' అని అనగానే విద్యార్థులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. మద్దిలపాలెం జోన్‌లో కొనసాగిన యాత్రకు అపూర్వ స్పందన లభించింది. సిఎంఆర్ సెంట్రల్ తోపుడు బండ్ల జంక్షన్ వద్ద పూలు జల్లి స్వాగతం పలికారు.

యాత్ర కొనసాగిన పలుచోట్ల జరిగిన సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడారు. తాము చేపట్టిన ఉక్కు రక్షణ యాత్రకు అన్ని వైపుల నుంచీ మంచి నైతిక మద్దతు లభించిందన్నారు. ఈ స్పందనను పక్కదోవ పట్టించడానికి బిజెపి ఎంపీ జివిఎల్ ప్రయత్నిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాలలో వలే అన్ని పార్టీలు ఆంధ్రాలోనూ ఐక్యంగా కలిసి ముందుకొచ్చి ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ కాకుండా ఆపాలన్నారు. విశాఖ ఉక్కు జోలికి వస్తే ప్రజలు ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ అక్టోబర్ 5న స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే విద్యార్థులకు, యువతకు ఉద్యోగాల కొరత ఏర్పడుతుందన్నారు. యాత్రలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, నాయకులు యుఎస్ఎన్.రాజు, వి.కృష్ణారావు, పి.మణి, డాక్టర్ జి.ప్రియాంక, ఎల్‌జె.నాయుడు, కుమార్, గౌరీష్, అప్పలరాజు పాల్గొన్నారు.

ఘనంగా కోచ్ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖ రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విశాఖ ఫుడ్ ఎక్స్‌ప్రెస్ కోచ్ రెస్టారెంట్‌ను కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శన జర్దోష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మ నిర్భర భారత్ కింద వాల్తేరు డివిజన్‌లో 17 స్టేషన్లను ఆదర్శ స్టేషన్లుగా తీర్చుదిద్దుతున్నామన్నారు. కార్తీక్ ఫుడ్ వరల్డ్ అధినేత కె.వంశీ మాట్లాడుతూ రైలు కోచ్‌ను ఈస్ట్ కోస్ట్ రైల్వే వారు అందజేసినట్టు తెలిపారు. విభిన్న రీతిలో రెస్టారెంట్ ఉండాలన్న ఆలోచనతో దీన్ని తీర్చిదిద్దామన్నారు. ఇక్కడ చైనీస్, దక్షిణ భారత దేశ అన్ని రకాల వంటకాలూ అందుబాటులో ఉంటాయన్నారు. 24 గంటలూ ఆహారం అందుబాటులో ఉంటుందన్నారు. రెస్టారెంట్ కోసం రూ.72 లక్షలు ఖర్చు చేసామని, ఈ కోచ్ రెస్టారెంట్ 72 సీటింగ్ సామర్థ్యం కలిగి ఉందని అన్నారు. అందుబాటు ధరలలో భోజనం, అల్పాహారం, స్నాక్స్ ఉంటాయన్నారు.

పలు అంశాలపై మంత్రి సమీక్ష

శనివారం ఉదయం కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శన జర్దోష్ విశాఖపట్నం స్టేషన్‌లో పర్యటించారు. స్టేషన్‌లో పునరాభివృద్ధి కార్యకలాపాలు, ఇతర మౌలిక సదుపాయాల తీరుపై సమీక్షించారు. విశాఖ స్టేషన్‌లో, డివిజన్‌లో జరుగుతున్న పలు కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. ఏటికొప్పాక బొమ్మలు విక్రయిస్తున్న వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను సందర్శించి విక్రేతతో సంభాషించారు. రైల్వే శాఖ నుంచి అమ్మకాలు, అధికారుల సహకారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్‌లోని సఫాయి కర్మచారులతో కలిసి స్వచ్ఛతా అభియాన్ - ప్లాస్టిక్ క్యాంపెయిన్‌లో పాల్గొని ఆరోగ్య కిట్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ దేశంలో అత్యంత రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో విశాఖ ఒకటన్నారు. మంత్రి వెంట డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ ఉన్నారు.

కనువిందు చేస్తున్న ప్రకృతి అందాలు

ఆహ్లాదకరంగా ప్రకృతి సోయగాలు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 6 గంటలకు అబ్బురు పరిచే ప్రకృతి రమణీయమైన దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. తెల్లవారుజామున సీలేరు రెగ్యులేటరీ డ్యామ్, మెయిన్ డ్యామ్ గుంటవాడ ప్రాంతాల్లో ప్రకృతి సోయగాలు సూపరుల మనసులను దోచుకుంటున్నాయి. మెయిన్ డ్యామ్‌కు అతి దగ్గరలో ఉన్న వాటర్ ప్లాంట్ సమీపంలో ఎత్తైన కొండలు, దట్టమైన పచ్చని చెట్లుపై మంచు మేఘాలు తెరచాపలా కమ్మేసి అలముకోవడంతో కాశ్మీర్ అందాలు తలపించాయి. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో పొల్లూరులో జాలువారే జలపాతాలు మరెన్నో సుందర దృశ్యాలు ఈ ప్రాంతాల్లో ఇమిడి ఉండడంతో తెలంగాణ రాష్ట్రం నుంచి మోతుగూడెం మీద నుంచి వచ్చేవారు ఈ అందాలను తిలకించి మైమరిసిపోతున్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - రంపచోడవరం : మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన స్థానిక ఎపిటిడబ్ల్యుఆర్ బాలుర పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యాంటీ ర్యాగింగ్ యాక్ట్, పోక్సో చట్టం, రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్, ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్, దిశ చట్టం, లోకాయుక్త తదితర వాటిపై చైర్మన్ అవగాహన కల్పించారు. బాలురు మంచి నడవడికతో గమ్యం చేరుకోవాలని సూచించారు. అనంతరం బాలుర వసతి గృహాన్ని, విద్యార్థుల కంప్యూటర్ల ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ జుడిషియల్ మేజిస్ట్రేట్, చైర్మన్ బి.ప్రవీర్, న్యాయవాది సిహెచ్.సంతోష్ కుమార్, ఎఎస్ఐ, పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

18వ రోజుకు టిడిపి నిరసన

ప్రజాశక్తి- చింతూరు : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ చింతూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ముందు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 18వ రోజుకు చేరాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇలా చిన్నారెడ్డి, పొదిలి రామారావు, ముత్యాల శ్రీరామ్, శీలం తమ్మయ్య, ఓ.నరసింహారావు, కుంజ బాలకృష్ణ, వాసశ్రీ రామ్మూర్తి రెడ్డి, పసుపులేటి సల్మాన్ రాజ్, చిన్న ముత్తయ్య, రవ్వ సునీత, అనిగిచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రసజ్ఞ ఆధ్వర్యాన 'ఎకో వైజాగ్' వీధి నాటిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్వచ్ఛభారత్ కార్యాచరణలో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జివిఎంసి ఆర్థిక సహకారంతో రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యాన తలపెట్టిన 'ఎకో వైజాగ్' వీధి నాటిక అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ విషయాన్ని నిర్వాహకులు వేమలి త్రినాథరావు వెల్లడించారు. తనతో పాటు డప్పు రమణ, హేమ, మహేంద్ర, మోహిద్దీన్, జయలక్ష్మి, పోలిరెడ్డి నటీనటులుగా ఉన్నారన్నారు. ఈ నాటికను దండు నాగేశ్వరరావు నాటకీకరించగా తాను దర్శకత్వం వహించారన్నారు.

విశాఖ పోర్టు అథారిటీతో అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పోర్టు పరిసర ప్రాంతాలలో గాలి కాలుష్యాన్ని తగ్గించటం, కార్బన్ ఉద్గారాలను నిలువరించడంపై పరస్పర అంగీకారంతో విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ల మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఈ మేరకు పోర్టు చైర్మన్ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.